www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 19 జనవరి 2025



నవోదయ పరీక్షకు 6,499 మంది హాజరు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శనివారం నిర్వహించిన నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 6,499 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ కాటా రామకృష్ణయ్య తెలిపారు. ఈ పరీక్షకు 8,971 మంది దరఖాస్తు చేసుకోగా 6499 మంది హాజరయ్యారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 37 సెంటర్లలో ఈ పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్షలు రాసిన వారిలో 80 మందిని నవోదయ విద్యాలయ సమితి సిబిఎస్ఇ సహాయంతో ఎంపిక చేస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థులు 2025 - 2026 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశించి 12 వ తరగతి వరకు ఈ విద్యాలయంలో చదువుకుంటారన్నారు.


ఉపాధి లేక నిరుద్యోగుల కష్టాలు

- హామీ అమలుపై సర్కారు నిర్లక్ష్యం
- ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించని వైనం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

గతంలో మా పాలనలో లక్షలాది టీచర్ పోస్టులు భర్తీ చేసాం. జగన్ ప్రభుత్వంలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. జాబు కావాలంటే బాబు రావాలి. మేము అధికారంలోకి వస్తే 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తాం. నిరాశలో ఉన్న నిరుద్యోగులకు మంచి రోజులు రప్పిస్తాం అంటూ గతేడాది జనవరి 10న తునిలో జరిగిన 'రా కదిలి రా' సభలో టిడిపి అధినేత, ప్రస్తుత సిఎం చంద్రబాబు హామీలు గుప్పించారు. ఇక్కడే కాదు ఎన్నికల అన్ని సభల్లోనూ ఆయన వరాల జల్లు కురిపించారు. ఆయన్ను నమ్మిన నిరుద్యోగులు కూటమి ప్రభుత్వానికి భారీ మెజారిటీ ఇచ్చి గద్దెనెక్కించారు. తీరా చూస్తే ఒక్క ఉద్యోగం కూడా ఇచ్చిన పాపాన పోలేదు. పైగా రాష్ట్ర వ్యాప్తంగా వాలంటీర్లు, ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేస్తున్న వారిని, ఎపి ఫైబర్ నెట్ లిమిటెడ్, ఎపి ఎండిసి కాంట్రాక్టు వర్కర్లు, యానిమేటర్లు, కొన్ని చోట్ల ఆశా వర్కర్లను, స్కూల్ ఆయాలను తొలగించారు. ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కల్పించకపోగా తిరిగి ఉన్న ఉద్యోగాలను పీకేస్తుండడంపై ఇటు బాధితులు, అటు నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో నిరుద్యోగుల సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతోంది. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా ప్రభుత్వ నియామకాలు చేపట్టడం లేదు. దీంతో వాటిల్లో నమోదైన వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇలా ఉమ్మడి జిల్లాలో ఏటా 40 వేల మందికి పైగా నిరుద్యోగులు తయారవుతున్నారు. గత 12 ఏళ్లలో దాదాపు 5 లక్షల మంది నిరుద్యోగులు తయారయ్యారనేది ఒక అంచనా. అటు ప్రైవేట్ రంగంలోనూ ఉపాధి అవకాశాలు నామమాత్రంగానే దక్కుతున్నాయి. దీంతో అనేకమంది విధిలేని పరిస్థితుల్లో హైదరాబాద్, చైన్నై, బెంగళూరు, ముంబై వంటి సుదూర ప్రాంతాలకు వలసలు పోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



ఆగమ్య గోచరంగా నిరుద్యోగుల పరిస్థితి

జిల్లాలో అనేకమంది నిరుద్యోగులు ప్రైవేట్ సంస్థల్లో చిన్న, చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అరకొర వేతనాలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. పలు ప్రైవేటు సంస్థల్లో రూ.7 వేలు నుంచి రూ.9 వేలకే పని చేయాల్సి వస్తుంది. ఉన్నత చదువులు చదువుకున్న వారు సైతం తక్కువ వేతనాలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. చదువుకున్నప్పటికీ ఉద్యోగ అవకాశాలు దక్కకపోవడంతో అనేకమంది అప్పుల పాలవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. కాకినాడ జిల్లాలో పారిశ్రామిక అభివద్ధికి అనేక అవకాశాలు ఉన్నప్పటికీ పరిశ్రమలు రావడం లేదు. కాకినాడ సెజ్‌లో నేటికీ పదివేల ఎకరాల భూములు ఖాళీగానే ఉన్నాయి. 13 ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఒక పరిశ్రమ కూడా రాకపోవడంతో ఉపాధికి ఆమడ దూరంలో నిరుద్యోగులు బతుకుతున్నారు. ఒకటి, రెండు అతి చిన్న పరిశ్రమలు వచ్చినప్పటికీ పదుల సంఖ్యలో మాత్రమే ఉపాధి అవకాశాలు దక్కిన పరిస్థితి ఉంది.

జాబ్ క్యాలెండర్ ఏమైంది.?

ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు జరిగిన పలు సభలు, సమావేశాల్లో చెప్పుకొచ్చారు. భారీగా ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాక నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడిచిపోయింది. నేటికీ ఒక్క ఉద్యోగాన్ని కూడా ఇవ్వలేక పోయింది. నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వడం లేదు. పైగా ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వేళ రాజకీయ పార్టీలన్నీ యువతను దృష్టిలో ఉంచుకుని హామీలు గుప్పించాయి. ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆశలు రేకెత్తించాయి. తాము అధికారంలోకి వస్తే 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.



ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ అన్నారు. 7 నెలలు గడిచిపోతున్నా క్యాలెండర్ లేదు. మెగా డిఎస్‌సి అని చెప్పి మినీ డిఎస్‌సిని విడుదల చేసినప్పటికీ వాటి భర్తీ విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. తక్షణమే స్పందించి జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలి. పెండింగ్‌లో ఉన్న నోటిఫికేషన్లు విడుదల చేయాలి.

-పి.దుర్గాప్రసాద్, డివైఎఫ్ఐ కాకినా జిల్లా కో- కన్వీనర్



చర్చల విజయవంతం అనంతరం జెసిఎల్ కార్యాలయం వద్ద సిఐటియు నేత శేషబాబ్జి, ఇతర నాయకులు

కార్మికుల పోరాటం విజయవంతం

-జెసిఎల్ సమక్షంలో ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్

ప్రజాశక్తి - కాకినాడ

ఏలేశ్వరం మండలం చిన్నంపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికుల 63 రోజుల పోరాటం విజయవంతం అయింది. పరిశ్రమను శాశ్వతంగా మూసేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించడంతో 409 మంది కార్మికులు సిఐటియు అండతో పరిశ్రమను తెరిపించాలని పోరాటాన్ని సాగించారు. శనివారం జెసిఎల్ సమక్షంలో జరిగిన చర్చల్లో ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్ జరిగింది. దీంతో గత 63 రోజుల పోరాటానికి ఫలితం దక్కిందని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు అన్నారు.

చిన్నంపేట జీడిపిక్కల పరిశ్రమను శాశ్వతంగా మూసేస్తున్నామని యాజమాన్యం ప్రకటించడంతో 409 మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. గత 63 రోజులుగా సిఐటియు అండతో కార్మికులు పోరుబాట పట్టారు. 63 రోజుల పోరాటంతో యాజమాన్యం దిగివచ్చింది. శనివారం జెసిఎల్ సమక్షంలో అటు యాజమాన్యం ప్రతినిధులు, ఇటు సిఐటియు నాయకత్వం మధ్య చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలోనే ఇండస్ట్రీయల్ డిస్ప్యూట్ యాక్ట్, పేమెంట్ ఆఫ్ గ్రాడ్యుటి యాక్ట్ ప్రకారం కార్మికులకు చెల్లించే క్లోజర్ బెనిఫిట్, గ్రాడ్యుటిలకు అదనంగా కార్మికుల సర్వీసుకు ఏడాదికి 20 రోజులు వేతనాన్ని చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. ప్రావిడెంట్ ఫండ్, ఇఎస్ఐ కాకుండా రూ.9 కోట్ల పరిహారాన్ని చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. వీటితోపాటు 2015 నుంచి 2018 వరకు 4 సంవత్సరాలు ఎగవేసిన ఆర్జిత సెలవుల పరిహారం, 60 రోజుల వేతనాన్ని ఇచ్చేందుకు అంగీకారం అయింది. చట్ట ప్రకారం గ్రాడ్యుటీ వర్తించని 160 మంది కార్మికులకు రెగ్యులర్ కావడానికి ముందు పనిచేసిన కాంట్రాక్టు కాలాన్ని కూడా లెక్కించి గ్రాడ్యుటీ చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. నోటీస్ పీరియడ్ 3 నెలలకు పూర్తి వేతనం, బోనస్ చెల్లించేలా, పరిశ్రమను తిరిగి ప్రారంభిస్తే రిట్రిచ్‌మెంట్ చేసిన కార్మికులకే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చేలా రాతపూర్వక ఒప్పందం జరిగింది.

63 రోజుల సుదీర్ఘ పోరాటం

పరిశ్రమను మూసివేయడంతో సుమారు 419 మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఏలేశ్వరం, ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లోని 24 గ్రామాలకు చెందిన కార్మికులు మిల్లును తెరవాలని సిఐటియు నాయకత్వంలో ఉద్యమాన్ని కొనసాగించారు. ధర్నాలు, రాస్తారోకోలు, మానవహారాలు నిర్వహించారు. ఏలేశ్వరం తహశీల్దార్ కార్యాలయాన్ని సైతం ముట్టడించారు. సిఐటియు, పరిశ్రమ నాయకత్వంపై పోలీసులు క్రిమినల్ కేసులు సైతం పెట్టారు. కొందరి కార్మికులకు యాజమాన్యం ప్రతినిధులు ఫోన్ చేసి ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నించారు. అయినా కార్మికులు మొక్కవోని దీక్షతో సిఐటియు నాయకత్వంలో ఉద్యమాన్ని కొనసాగించి ఆఖరికి విజయాన్ని సాధించారు.

సహకరించిన వారికి కృతజ్ఞతలు

పరిశ్రమను తెరిపించాలని పోరాడుతున్న కార్మికులకు అండగా నిలిచిన వారికి సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక శాఖ అధికారులతో చర్చలు జరిగేలా ఎంఎల్ఎలు వరుపుల సత్యప్రభ, జ్యోతుల నెహ్రూ కృషి చేశారని, అలాగే కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, జెసిఎల్ రాణి, డిసిఎల్ పొలిశెట్టి శ్రీనివాస్‌లకు వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. సిఐటియు అనుబంధ ప్రజా సంఘాల నాయకులకు, లాయర్ల సంఘ నాయకులకు, స్థానిక ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు వారు అభినందనలు తెలిపారు.

పోలీసుల పెట్రోలింగ్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణ పరిధిలో నేరాలను అరికట్టే లక్ష్యంతో పోలీసులు పెట్రోలింగ్‌ను చేపట్టారు. ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని రైల్వే స్టేషన్, సోరంపేటకు వెళ్లే బ్రిడ్జి, నందిరాయి వీధి నిర్మానుష ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఎస్ఐ మాట్లాడుతూ నేరాల జరుగుతున్న నేపథ్యంలో ఎవరైనా అనుమానస్పద వ్యక్తులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



ఉత్సాహంగా చదరంగ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న 13వ జాతీయస్థాయి స్కూల్ చదరంగం పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. శనివారం పోటీలను ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆర్బిటర్స్ కమిషన్ ఛైర్మన్ ఆర్ రాజేష్ పర్యవేక్షించారు. ఈ పోటీలను తిలకించి ఆర్బిటర్స్‌కి ఆయన ప్రత్యేక సూచనలు చేశారు. పోటీలు జరుగుతున్న తీరు, చదరంగంలో విద్యార్థులు ప్రదర్శి స్తున్న మెళకువలు, నైపుణ్యం చూసి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. చదరంగం ఆటకు సంబంధించిన పలు మెలకువలను ఆయన చదరంగం ఆడి విద్యా ర్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఛైర్మన్ కెవి.శర్మ, ప్రెసిడెంట్ ఎసి ఎ.అడుసుమిల్లి, ప్రథమ ఎ గ్రేడ్ ఇంటర్నేషనల్ చెస్ ఆర్బిటర్ ఆఫ్ ఇండియా అయిన రతినం అనంతరామ్, శ్రీ ప్రకాష్ స్కూల్ డైరెక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న నాగేశ్వరరావు, ఇతరులు

పర్యావరణ రక్షణతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

భవిష్యత్ తరాల మనుగడ పర్యావరణ పరిరక్షణపైనే ఆధారపడి ఉందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, పర్యావరణ సంఘం ఉపాధ్యక్షుడు అనసూయ నాగేశ్వరరావు అన్నారు. ప్రకృతి పరిరక్షణ సంఘం అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు 72వ పుట్టినరోజు పురస్కరించుకుని సంఘం సభ్యులు ఏలేశ్వరంలో పలు సేవా కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. పలు కూడళ్లలో మొక్కల నాటి అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సమ్మెట శ్రీను కుటుంబానికి నగదు, బియ్యం నిత్యవసరాలు అందజేశారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయానికి చేరుకుని ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలని కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గోళ్ళ నాగేశ్వరరావు, జ్యోతుల నాగసత్యశ్రీనివాస్, తాళ్లూరి గొల్లాజిరావు, డివివి.సత్యనారాయణ, కరోతు సత్యనారాయణ, గొల్లపూడి గణేష్, ముత్యాల గంగరాజు, రౌతు సహదేవుడు, నారాయణరావు పాల్గొన్నారు.

పరిసరాలల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం శనివారం ప్రారంభం అయింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కరప పరిశుభ్రమైన వాతావరణంతోనే ప్రజారోగ్యం, పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అన్నారు. కరప గ్రామంలోని మార్కెట్ సెంటర్ వద్ద నుంచి మెరక వీధి మీదుగా నిర్వహించిన స్వచ్ఛత ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం భవిష్యత్ తరాలకు అందించవచ్చన్నారు. జిల్లాలో అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయ ప్రాంతాల్లో చెత్తకుప్పలు, పిచ్చి మొక్కలు తొలిగించడం, మురికి కాలువలు శుభ్రం చేయడం, బస్టాండ్లు, మార్కెట్ సెంటర్లు ఇతర ప్రధాన కూడళ్లను శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి నెల మూడో శనివారం జరిగే స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం అందరూ తమ వంతు బాధ్యతగా భావించి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఒ వి.రవికుమార్, జనసేన నాయకుడు భోగిరెడ్డి గంగాధర్, ఎంపిపి పి.శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపిడిఒ ఎం.అనుపమ, ఇఒపిఆర్‌డి ఎస్.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. **కాకినాడ** కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఒ జె.వెంకట్రావుతో కలిసి కార్యాలయ పరిసరాలను శుభ్రపరిచారు. ప్లాస్టిక్ బాటిల్స్, ఇతర చెత్తను సేకరించి ప్రదేశాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జెసి, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది అందరితో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. స్వచ్ఛ కార్యక్రమం ద్వారా జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు స్వచ్ఛంద సంస్థలు, ప్రజలను భాగస్వామ్యులు చేసి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. దీనిని ద్వారా స్వచ్ఛతపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఒ పి.త్రినాథ్, సమాచార పౌర సంబంధాల శాఖ డిడి డి.నాగార్జున, పౌరసరఫరాల సంస్థ డిఎం ఎం.దేవులానాయక్, వికాస పీడీ కె.లచ్చారావు, జౌళి శాఖ ఎడి పెద్దిరాజు, కలెక్టరేట్ ఎఒ రామ్మోహన్ రావు, వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. వీధులను శుభ్రపరిచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించడానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పోతుల మోహనరావు, సిఐ శ్రీనివాస్, తహశీల్దార్ రమేష్, ఎంపిడిఒ చంద్రశేఖర్, సిడిపిఒ పూర్ణిమ, సిబ్బంది పాల్గొన్నారు. **యు. కొత్తపల్లి** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ దివాన్ కార్యక్రమంలో అధికారులు ప్రతిజ్ఞ చేశారు. పలు గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు పరిశుభ్రతా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.రవికుమార్, ఇఒపిఆర్‌డి సత్యకృష్ణరెడ్డి, ఎంఇఒ పైడ్రాజు, సూపరింటెండెంట్ చలమయ్య, తదితరులు పాల్గొన్నారు. **సామర్లకోట** సామర్లకోట పట్టణ, మండల పరిధిలోని పలు గ్రామాల్లో స్వచ్ఛ దివాస్ కార్యక్రమాలు జరిగాయి. పి.వేమవరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, ట్రైనీ కలెక్టర్ భావన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త ఎక్కడ ఉన్న దోమల అభివృద్ధి చెంది ప్రజలకు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలను తెచ్చిపెడతాయని అన్నారు. నివాసాల మధ్యలో చెత్తను ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ఎంపిడిఒ కె.హేమమహేశ్వరి ఆధ్వర్యంలో జరిగింది. అలాగే పట్టణంలోని మఠం సెంటర్లో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిజ్ఞా కార్యక్రమంతోపాటు, మానవహారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో డిపిఒ రవికుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, సర్పంచ్ నూకరత్నం, ఇఒపిఆర్‌డి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **తాళ్లరేవు** ఎంపిడిఒ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక పెంకె వారి పేట స్మశాన వాటికను సిబ్బంది శుభ్రం చేశారు. అలాగే మండలంలోని పలు పంచాయతీలో జరిగిన కార్యక్రమాల్లో ఆయా సర్పంచులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **గండేపల్లి** గండేపల్లి గ్రామ రహదారులను పరిశుభ్రం చేయడంతో పాటు అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ నాతి బుజ్జి, మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, నాయకులు యాలమాటి కాశి, సుంకవలి రమేష్, వెంపాటి సతీష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిసరాల ప్రాంతాలను సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, ఎస్ఐ శివ నాగు ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. **పిఠాపురం** స్థానిక ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ జయరాం ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్త్ సెంటర్ ఆవరణను ఆసుపత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు శుభ్రం చేశారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. **పెద్దాపురం** స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీరమణి పాల్గొని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం ఎఒ మాధవరావు, డిటి భానుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయం, మండల పరిధిలోని పలు గ్రామాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఒ శ్రీలలిత, ఇఒపిఆర్‌డి రమణ పాల్గొన్నారు. **కాజులూరు** స్థానికంగా ఎంపిడిఒ రాంబాబు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించారు. గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమాలు జరిగాయి.



కరపలో అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్



సామర్లకోటలో చీపురు పట్టిన ఎంఎల్ఎ చినరాజప్ప



జగ్గంపేటలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ



యు.కొత్తపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

కార్టూ'నిజం'




ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి

ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎంఎల్ఎలు, ఇతర ప్రజాప్రతినిధులతోపాటు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ టిడిపి కార్యాలయంతోపాటు, జడ్‌పి కూడలిలోని ఎన్‌టిఆర్ విగ్రహాలకు ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిజిహెచ్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రి వద్ద అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లిపూడి వీరు, సుంకర పావని, నులుకుర్తి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబా, కొల్లాబత్తుల అప్పారావు, తాజుద్దీన్, ఆన్సర్, తదితరులు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, తోటకూర శ్రీనివాసు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, భీమేశ్వరాలయ ధర్మకర్తలమండలి మాజీ ఛైర్మన్ కంటే జగదీష్, తెలుగుదేశం పార్టీ నాయకులు బలుసు వాసు, తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక మెయిన్ సెంటర్లో ఉన్న ఎన్‌టిఆర్ కాంస్య విగ్రహానికి ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పుష్కర ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ అడబాల భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** నియోజవర్గంలో పలుచోట్ల ఎన్‌టిఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సర్పవరం గ్రామంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పవరం జంక్షన్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎంఎల్‌ఏ పంతం నానాజీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. **రౌతులపూడి** స్థానిక మార్కెట్ సెంటర్ ఆవరణలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైలా సాంబశివరావు, టిడిపి నేతలు నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక టిడిపి కార్యాలయంలో, బంగారమ్మ రావి చెట్టు, మిరపకాయల వీధి, ఇందిరానగర్ మండలంలోని విరవాడ, నరసింగపురం, గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్.వర్మ నివాళులర్పించారు. అలాగే స్థానిక బంగారమ్మ తల్లి రావి చెట్టు సెంటర్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, కరణం విశ్వనాథం, జిఎస్.భాస్కర్, వి.సూర్యనారాయణ, వి.తరుణ్, కె.రమణ, తదితరులు పాల్గొన్నారు. **శంఖవరం** మండలంలోని అన్నవరం గ్రామంలో ఎన్‌టిఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు పర్వత సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పేదలకు దుప్పట్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శివ, బి.రామారావు, తదితరులు పాల్గొన్నారు. **గండేపల్లి** గండేపల్లి గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షులు ఎలమటి కాశీ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు పోతుల మోహనరావు, జిల్లా ఉపాధ్యక్షులు కోర్పు సాయి తేజ ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు మురారి గ్రామ టిడిపి కార్యాలయంలో యువ నాయకులు జాస్తి వసంత్ నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ కుక్కల ఆనంద్, టిడిపి నాయకులు ఇప్పర్ల బాబి, వెంపాటి సతీష్, తదితరులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎంపిపి గొల్లపల్లి బుజ్జి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **ప్రత్తిపాడు** స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ సర్పంచ్ యాళ్ళ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, యాళ్ల జగదీష్, చక్కపల్లి మందేశ్వరరావు, గొంతిన సురేష్, వెలుగుల నాని పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. తెలుగు యువత గౌరవ అధ్యక్షులు చంద్రు వీర్రాజు చౌదరి, పేపకాయల నారాయణరావు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. **తాళ్లరేవు** స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మందాల గంగ సూర్యనారాయణ, వాడ్రేవు వీరబాబు, కట్టా త్రిమూర్తులు, ఉంగరాల వెంకటేశ్వరరావు, జక్కల ప్రసాద్ బాబు పాల్గొన్నారు.



కాకినాడలో నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ వనమాడి, నవీన్, చిక్కాల



పిఠాపురంలో నివాళులర్పిస్తున్న మాజీ ఎంఎల్ఎ వర్మ, ఇతరులు

నేరాలు ఘోరాలు

గాయపడిన వైద్యుని మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

పటవల వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన యానంకి చెందిన వైద్యుడు పోపావత్ వెంకటేశ్వర నాయక్ (36) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. ప్రకాశం జిల్లా, నరజాముల తండా, పుల్లలచెరువు, మల్లపాలెంకి చెందిన ఆయన కాకినాడలో నివాసముంటూ యానాం ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలందిస్తున్నారు. విధులు ముగించుకుని కాకినాడ వెళుతుండగా పటవల వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కోరంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మరణం

ప్రజాశక్తి - బిక్కవోలు

లారీ ఢీకొని బైకుపై వెళ్తున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన బలభద్రపురం గుబ్బాలమ్మ గుడి వద్ద శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనపర్తి గ్రామానికి చెందిన గదుల శ్రీను (53) బలభద్రపురంలో రామకృష్ణ ఇంజినీరింగ్ వర్క్ షాప్‌లో పని చేస్తున్నాడు. యజమాని శ్రీనుకి వేరే చోట పని పురమాయించడంతో అక్కడికి వెళ్లి పని పూర్తి చేసుకుని సాయంత్రం వర్క్ షాప్ వద్దకు వస్తుండగా మురళీమోహన్ రైస్ మిల్లుకు చెందిన లారీ వెనకనుంచి బలంగా ఢీకొని శ్రీను మీద నుంచి వెళ్లిపోవడంతో శ్రీను అక్కడికి అక్కడే మృతి చెందాడు. శ్రీనుకు భార్య ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. శ్రీను భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రవిచంద్ర తెలిపారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయిని మృతి

ప్రజాశక్తి-తాళ్లపూడి

మండలంలోని వేగేశ్వరపురంలో మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని తైలం సాయి చంద్ర (50) శనివారం గుండె పోటుతో మరణించారు. సంక్రాంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆమె నర్సీపట్నం వెళ్లారు. ఆదివారంతో సెలవులు ముగియడంతో సోమవారం విధులకు సిద్ధమవుతుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఆమె మృతి చెందారు. ఆమె కొంతకాలంగా హృద్రోగ సమస్యలతో బాధ పడుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ఆమె మృతికి ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు, మండల శాఖ అధ్యక్షుడు రఘువీర శాస్త్రి, ప్రధాన కార్యదర్శి శంకరం, ఉపాధ్యాయులు కనకదుర్గ, రాజారత్నం, జివికె.రాజు, పద్మశ్రీ మణి తదితరులు సంతాపం తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో ఎఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం పోలీస్ స్టేషన్‌ను ఎఎస్‌పి సుబ్బరాజు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసులకు సంబంధించి రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన కొత్త చట్టాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కేసులకు సంబంధించి పోలీసులు సమగ్రంగా దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి కోర్టులో ఛార్జిషీట్‌ను నిర్ణీత సమయంలో దాఖలు చేయాలని సూచించారు. కేసులకు సంబంధించి మైనర్లను నేరుగా పోలీస్ స్టేషన్‌కు తీసుకురాకూడదని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్, లా అండ్ ఆర్డర్, కొత్త చట్టాలపై అవగాహన, సైబర్ నేరాలపై అవగాహన అవగాహన కల్పించారు. బాలికలు, మహిళలపై నేరాలు జరగకుండా దాడులు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎస్ఐ కె.సతీష్ కుమార్ ఉన్నారు.

ఎల్‌సిడిసి సర్వేపై అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా సోమవారం నుండి నిర్వహించనున్న సర్వేపై శనివారం పిహెచ్‌సిలో వైద్యాధికారి ఆర్ఎస్ఎస్‌వి ప్రసాద్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరిగే లెప్రసీ (ఎలసిడిసి) సర్వేలో భాగంగా ఆశా వర్కర్లు, వాలంటీర్లు కలసి ప్రతి ఇంటినీ దర్శించి, కుటుంబంలో ఎవరైనా లెప్రసీ లక్షణాలు కలిగి ఉన్నారా లేదా అని పరిశీలించారు. ఆ వివరాలు నమోదు చేసుకుని పిహెచ్‌సికి రోజువారీ రిపోర్ట్ అందజేయడం వంటి తదితర వివరాలను తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి ఆశా వర్కర్‌కూ ఒక టీము నెంబర్ ఇచ్చామని, వారు ఇంటిని విజిట్ చేసి, వారు సేకరించాల్సిన వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఉషా దేవి, పబ్లిక్ హెల్త్ నర్స్ కెడివిఎల్.కుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు జి.శ్రీనివాసు, కె.సుభాషిణి, నాగమణి పాల్గొన్నారు.

విఆర్‌ఒల సంఘం అధ్యక్షునిగా మొహిద్దీన్

ప్రజాశక్తి-చాగల్లు

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం మండల అధ్యక్షునిగా మహమ్మద్ మున్నీర్ మొహిద్దీన్ అధ్యక్షునిగా ఎన్నికైనట్టు సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ మేడిది కమల సుందర్ తెలిపారు. మండల నూతన కమిటీ వి.జ్యోతి (వైస్ ప్రెసిడెంట్) టి.రవి (సెక్రెటరీ) పి.సుభాష్ చంద్రబోస్ (జాయింట్ సెక్రెటరీ) జొన్నకూటి శేషు (ట్రెజరర్) సిహెచ్.పద్మ సూర్య కుమారి (జాయింట్ ట్రెజరర్) కమిటీ సభ్యులుగా ఎం.శివ శంకర్. ఎస్.మధు బాబు, కె.సత్యనారాయణ, ఎ.గీతాప్రసాద్ ఎన్నికైనట్టు తెలిపారు.

పశుఆరోగ్య వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-చాగల్లు

ఈ నెల 20 నుంచి 30 వరకూ ఉదయం 8 గంటల నుంచి ఆయా గ్రామాల వద్ద పశువులు, దూడలు, మేకలు, కోళ్లకు నట్టల నివారణ మందులు వివిధ రకాల వ్యాధుల నివారణకు టీకాలు వేస్తామని పశు వైద్యులు డాక్టర్ యు.ముఖేష్ తెలిపారు. ఈ నెల 20న నెలటూరు, 21న చంద్రవరం, గౌరుపల్లి, 22న నందిగంపాడు, 23న మార్కొండపాడు, 24న ఊనగట్ల, 25న ఎస్.ముప్పవరం, 27న బ్రాహ్మణగూడెం, 28న ధారవరం, 29న మల్లవరం, 30న చిక్కాల గ్రామాల్లో పశుఆరోగ్య వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

కళ తప్పిన సంక్రాంతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సంక్రాంతి సంబరాలకు కళ తప్పింది. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలను ఈ పండుగలు అద్దం పట్టేవి. భోగి మంటలు, పిండివంటలు, కొత్త బట్టలు, చిన్నారుల కేరింతలు, బంధువుల సందళ్లతో పండుగ సంబరాలు అంబరాన్ని అంటేవి. ప్రస్తుతం ఈ వేడుకలు సంపన్న కుటుంబాలకు మాత్రమే పరిమితం అయ్యాయి. పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో కొన్ని కుటుంబాలు తప్పనిసరి పరిస్థితుల్లో బంధువులను ఆహ్వానించగా మరి కొన్ని కుటుంబాలు తమ ఇంట్లోనే పండుగ నిర్వహించుకుని మమ అనిపించక తప్పలేదు. ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకుల ధరలు గణనీయంగా పెరిగాయని, ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిందని ఇటీవల పార్లమెంటు సాక్షిగా పాలకులే ఒప్పుకున్న విషయం విధితమే. అయితే ఈ పరిస్థితి అధిగమించేందుకు కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పాలకులు కనీస చొరవ చూపలేదు. మరోవైపు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సంక్రాంతికి ప్రజా పంపిణీ ద్వారా సంక్రాంతి కానుక ఇస్తారని ఎదురు చూసిన దిగువ, మధ్య తరగతి ప్రజలకు నిరాశే మిగిలింది. బియ్యం మినహా కందిపప్పు, పంచదార సైతం పూర్తి స్థాయి కేటాయింపులు లేకపోవటంతో అరకొరగా పంపిణీ చేసి పాలనా యంత్రాంగం చేతులు దులుపుకుంది. దీంతో సంపన్న కుటుంబాలు మినహా ఇతర కుటుంబాలకు సంక్రాంతి పండుగ పూర్తిగా దూరమైంది.

జూదం పేరుతో జేబులు ఖాళీ

హైకోర్టు ఆదేశాలను, పోలీసుల హెచ్చరికలను సైతం జిల్లాలో జూదాల నిర్వాహకులు బేఖాతరు చేశారు. ఉమ్మడి జిల్లాలో కోళ్ల కత్తులు దూశాయి. పండుగకు ముందు పోలీసులు అక్కడక్కడా కోడి పందేల బరులపై దాడులు చేసి కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. అయితే పండుగ మూడు రోజులూ సుమారు 250కి పైగా బరులు వేసినట్లు అంచనా. కోడి పందేలతో పాటు గుండాట, పేకాట వంటి జూద క్రీడలు సైతం యథేచ్ఛగా జరిగాయి. ఈ నేపథ్యంలో సుమారు రూ.200 కోట్లు చేతులు మారినట్లు స్పష్టమవుతోంది. జిల్లా వాసులే కాక జిల్లాయేతరులు కూడా ఇక్కడి వచ్చి జూదంలో పాల్గొన్నారు. మొత్తంగా ఈ వ్యవహారంలో నిర్వహకులు, అక్కడక్కడ పదుల సంఖ్యలో కొద్ది మంది వ్యక్తులు మినహా మిగిలిన వారంతా పూర్తిగా నష్టపోయారు. నగదుతో పాటు విలువైన ఆభరణాలు, భూములను సైతం కోల్పోయిన వారున్నారంటే అతిశయోక్తి కాదు. అయినప్పటికీ పోలీసులు బరులవైపు కనీసం కన్నెత్తి చూడలేదు. దీంతో పాలకుల ఒత్తిళ్లే కారణమనే విమర్శలు విన్పిస్తున్నాయి. పలువురు ఎంఎల్ఎలకు పందెం బరుల నిర్వహకుల లక్షల రూపాయలు నగదు ముట్టజెప్పటమే ఈ దుస్థితికి కారణమనే ఆరోపణలు వినవచ్చాయి.

ప్రభవించిన కోనసీమ

కోనసీమ ప్రభల ఉత్సవాలు ఈ ఏడాదీ ఘనంగా జరిగాయి. జగ్గన్నతోట, వాకల గరువు, తొండవరం, కొర్లగుంట, చెయ్యేలు తదితర గ్రామాల నుంచి ప్రభలను ఉత్సాహంగా కేరింతలతో తీసుకెళ్లిన దృశ్యాలు యాత్రికులను



ఆబ్బురపరిచాయి. ఈ తీర్థాలకు రాష్ట్రం నలు మూలల నుంచి యాత్రికులు తరలి వచ్చారు. ఇక్కడి గ్రామాలతో అనుబంధం ఉన్న ఇతర రాష్ట్రాల వారు సైతం తరలి రావటంతో మరింత రద్దీ నెలకొంది. ప్రభల ఉత్సవాల సందర్భంగాకొబ్బరి తోటలు, రోడ్లు, వరిచేల గట్లు, పంట కాల్వల గట్లు కిక్కిరిసి పోయాయి. ప్రతి ఏటా నిర్వహించే ఈ ఉత్సవాల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పించే దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం

అదనపు ఛార్జీలను నిరసిస్తూ విద్యుత్ వినియోగదారులు వినూత్న నిరసన తెలిపారు. సిపిఎం పిలుపుతో విద్యుత్ ఛార్జీల బిల్లులను భోగిమంటల్లో దహనం చేశారు. పట్టణాలతో పాటు పల్లెల్లోనూ ప్రజలు ఈ నిరసన కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన విషయం విధితమే. అయితే అధికారంలోకి వచ్చిన ఆరుమాసాల్లోనూ రెండు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచటంపై వినియోగదారులలో ఆందోళన వ్యక్తమవుతోంది.

యానాం వార్తలు



వాహనదారునికి అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

జాతీయ రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా శనివారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పాలిటెక్నిక్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - యానాం

స్థానిక దొడ్డి గంగమ్మతల్లి అమ్మవారి ఆలయానికి ఐ.పోలవరం మండలం కొమరగిరికి చెందిన జంపన వెంకట సూర్యసుబ్రహ్మణ్యేశ్వర వర్మ, ఉషారాణి దంపతులు రూ.లక్షా 116 లు విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా శనివారం ఆలయంలో జంపన వెంకట సూర్య సుబ్రహ్మణ్యేశ్వర వర్మ, ఉషారాణి, కుమార్తెలు సాత్విక, మధులికలతో కలిసి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ కోనకొండ బాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు కోన వీరవెంకట రామచంద్రరావు, కోన సూరిబాబు, కోన కొండబాబు, కవల కోటేశ్వరరావు, తోట భైరవ స్వామి, చిక్కాల నరసింహమూర్తి, గంగరాజు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - సామర్లకోట



బహుమతులు అందజేస్తున్న ఫాతిమా

డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు సైపిరెడ్డి యువరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీల్లో విజేతలకు శనివారం బహుమతుల ప్రధానం చేశారు. తొలుత మహిళలకు ముగ్గులు పోటీలు, బాల బాలికలకు మ్యూజికల్ ఛైర్, స్పూన్ అండ్ లెమన్, స్లో సైక్లింగ్, పరుగు పందెం, కుండ కొట్టు గిఫ్ట్ కొట్టు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు సిఐటియు నాయకురాలు ఎస్‌కె.ఫాతిమా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత కోడిపందేలు, గుండాటలు ఆడుతున్న తరుణంలో డివైఎఫ్ఐ సంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు సైపురెడ్డి యువరాజు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి - పిఠాపురం



సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకుడు

ఈనెల 10వ తేదీన పిఠాపురంలో గోకులాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం తపవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని పలు దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రథాల పేటలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మల్టీపర్పస్ కళ్యాణ మండపంలో దళిత సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అగ్రహారం, రథాలపేట, ఇందిరానగర్ లో గంజాయి వాడకం పెరిగిపోయిందని పవన్ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. దళిత కాలనీల్లో గంజాయి వాడకం పెరిగినట్టు తమపై నిందలు వేయడం సరి కాదన్నారు. తక్షణమే ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని, లేకుంటే భవిష్యత్తులో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుబ్బల రాజు, బిఎస్‌పి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖండవల్లి లోవరాజు, నాయకులు పి.అప్పలరాజు, పి.రాజేష్ కుమార్, బి.దేవా, ఎస్.శ్యామలరావు, సిహెచ్.నూకరాజు పాల్గొన్నారు.

ప్రజల కష్టాలను తీర్చడమే లక్ష్యం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



బాధితులకు నగదు సాయాన్ని అందిస్తున్న ముదునూరి

ప్రజలు కష్టాలు తీర్చడమే ఎంఎంఆర్ ట్రస్ట్ లక్ష్యమని ట్రస్ట్ ఛైర్మన్, వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని వాకపల్లి గ్రామానికి చెందిన మురుకుర్తి రాణి ఇటీవల కాలంలో రోడ్ ప్రమాదంలో గాయపడింది. ఆమెను శనివారం పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. అదే గ్రామానికి చెందిన మురుకుర్తి అప్పన్న ఇటీవల మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ.5 వేల సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకునేందుకు ట్రస్ట్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బర్ల గోవింద్, ఆదినారాయణ, గింజాల సత్తిబాబు, గొర్ల రమణ, సింహాద్రి పాల్గొన్నారు.

డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి మృతి

ప్రజాశక్తి - కాజులూరు



నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు

పేదల డాక్టర్‌గా పేరు పొందిన ప్రముఖ వైద్యులు సత్తి శ్రీరామ రెడ్డి అకాల మరణం చెందారు. సంక్రాంతి ముందు రోజు ఆయన కుటుంబ సభ్యులతో కలిసి అరుణాచలం వెళ్లారు. అక్కడ గుండె పోటు రావడంతో మృతి చెందారు. ఆయన పార్థివదేహాన్ని శనివారం ఉదయం గొల్లపాలెం తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన పార్థివ దేహాన్ని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక, ఉపసర్పంచ్ తాడి భువనేశ్వరి, వైసిపి నాయకులు తాడి వెంకటరెడ్డి, గుబ్బల యేసురాజు, ఇతర ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. శ్రీ రామరెడ్డి సతీమణి గంగాదేవి అడిషనల్ పబ్లిక్ ప్రాశిక్యూటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఆధార్ ప్రత్యేక క్యాంపులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఆధార్ సేవలు గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో అందించడానికి మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ కె.స్వప్న తెలిపారు. 0-5 సంవత్సరాల పిల్లలకు ఆధార్ నమోదు చేయుట, నమోదు పూర్తి అయిన కార్డు రానివారు, ఐదేళ్ళు దాటిన పిల్లలకు బయోమెట్రిక్ ఆప్షన్, ఇంటి చిరునామా మార్పు, 2010-2015 మధ్య తీసుకున్న కార్డులు అప్‌డేట్ చేసుకునేందుకు ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని తాటిపర్తిలో ఈ నెల 21, 22 తేదీల్లోనూ, చందుర్తిలో 23, 24, దుర్గాడలో 27, 28, చేబ్రోలులో 29, 30 తేదీల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.



విన్నర్ జట్టుతో నిర్వాహకులు, అతిథులు

పోటీల విన్నర్‌గా గురజనాపల్లి జట్టు

ప్రజాశక్తి - కరప

స్థానిక జడ్‌పి హైస్కూల్లో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విన్నర్‌గా గురజనాపల్లి జట్టు నిలిచింది. మండలంలో పలు గ్రామాలకు చెందిన జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గురజానపల్లి విన్నర్‌గానూ, జెడ్ భావారం జట్టు రన్నర్‌గా నిలిచింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఎం.జగదీష్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా శివ నాగేంద్ర ఎంపికయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బోండా సూర్యరావు, మాజీ సర్పంచ్ పి.తాతీలు, దేవ్‌మధు వీరేష్, పబ్బినీడి పాపారావు, అడప శ్రీనివాస్, నక్క సత్తిబాబు, పబ్బీడి పాపారావు, గరగ అప్పారావు, వాసిరెడ్డి రాంబాబు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి-గోపాలపురం

జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశాలకు సంబంధించి శనివారం గోపాలపురం జిల్లా పరిషత్ హైస్కూల్లోలో రాత పరీక్షలు నిర్వహించారు. కొవ్వూరు, తాళ్లపూడి, గోపాలపురం, నల్లజర్ల మండలాల పరిధిలోని ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నవోదయ విద్యాలయాల్లో ఆరవ తరగతి ప్రవేశాలకు సంబంధించి రాత పరీక్ష నిర్వహించినట్లు ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ పి.సోమశేఖర్, అబ్జర్వర్ పివిఎన్.రావు తెలిపారు. మొత్తం 233 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా 146 మంది హాజరైనట్లు తెలిపారు.

నర్సరీలను సందర్శించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-కడియం

మండలంలోని కడియపులంక శ్రీసత్యదేవ (పుల్లా చంటియ్య) నర్సరీని రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ ఆర్‌డిఒ కృష్ణ నాయక్ శనివారం సందర్శించారు. ఆయనకు నర్సరీ అధినేత పుల్లా పెద్ద సత్యనారాయణ ఘన స్వాగతం పలికారు. నర్సరీ అందాలను చూసి ఆర్‌డిఒ మంత్రముగ్ధులయ్యారు. దేశ విదేశీ మొక్కలతో శ్రీ సత్యదేవ నర్సరీ కనువిందు చేస్తోందని పేర్కొన్నారు.

సిసి కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని వ్యాపార కేంద్రాల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అవసరమని సిఐ జి.శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ కళ్యాణ మండపంలో వస్త్ర దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నేరగాళ్లు అధికంగా వ్యాపార సంస్థల్లో చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. నేరాల నియంత్రణలో సిసి కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. నేరాల కట్టడికి, నేరస్తులను గుర్తించేందుకు, స్వీయ రక్షణకు అవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. యజమానులు వారి వ్యాపార కేంద్రాల్లో తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎస్ఐ మణికుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని వివరించారు. గుర్తు తెలియని నెంబర్ల నుంచి వచ్చిన ఫోన్ల పట్ల జాగ్రత్తలు పాటించాలని, బ్యాంకు నుంచి ఫోన్ చేశామని, మీకు ఒక మెసేజ్ వస్తుందని, దానికి సంబంధించిన ఒటిపి చెప్పాలని అడుగుతారని అటువంటి కాల్స్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వల్లభస్వామికి రూ.2.94 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.2.94 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ దర్శనం టికెట్ల ద్వారా రూ.2,00,920, అన్నదాన విరాళాల ద్వారా రూ.87,090, కేశఖండల ద్వారా రూ.5,800, తులాభారం ద్వారా రూ.950 మొత్తం రూ.2,94,760 ఆదాయం సమకూరిందన్నారు.

రథం నిర్మాణ దాతలకు రావిపాటి సత్కారం

ప్రజాశక్తి-కడియం

రూ.18 లక్షలతో టేకు రథాన్ని తయారు చేయించి కడియపులంక ముసలమ్మ తల్లి ఆలయానికి అందజేసిన నక్కా కాశి సోదరులను వైసిపి రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావు శనివారం ఘనంగా సత్కరించారు. కడియపులంక శ్రీవిశ్వేశ్వర హైటెక్ నర్సరీకి వెళ్లి నక్కా కాశి విశ్వేశ్వరరావు, అమ్మిరాజు సోదరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గట్టి వీరబాబు, గాదంశెట్టి రాంబాబు, ఆరేటి వెంకటరావు, గవర మోహన్ రావు, కొత్తూరు సతీష్, పుల్లెపు శ్రీనివాస్, మెల్లిమి భాస్కర రావు తదితరులు ఉన్నారు.